మండు వేసవి!

సమయం సాయంకాలం!

గోదావరీ నదీతీరం!

సాయంత్రం అయినా ఎండవేడి పూర్తిగా తగ్గలేదు. గోదావరి నిండుగా వుంది.

రావు అతని భార్యా, ఇద్దరు పిల్లలతో నర్సాపురం పెళ్ళికొచ్చి ఆ వూళ్ళోకల్లా పెద్దదీ, హుందావున్నదీ అనుకున్న ఓ హొటల్లో దిగాడు.

ఉదయం పెళ్ళవగానే అలా గోదావరి ఒడ్డుకెళ్ళి అక్కడి సుందర దృశ్యాలు చూడాలనీ, ఆ దృశ్యాన్ని మనోఫలకంపై ముద్రించుకుని ఆ ముద్రలు పేపరు మీద పెట్టాలనీ ఆశించాడు రావు.

రావు కలం ఎన్నో ప్రేమకథలు, మరెన్నో పేద కథలు రాసి అతనికి కావల్సిన పేరు ప్రఖ్యాతులు సంపాయించి పెట్టింది. బహుమతుల్ని అందుకునేలా చేసింది.

రావు నిరాడంబరంగా వుంటాడు. పేదవాళ్లంటే అతనికి అంతులేని జాలి! చెట్లనీడన, ఫుట్‌పాత్‌లమీద, రైల్వే ప్లాట్‌ఫారమ్ మీద ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ చలికి వణుకుతూవుండే నిర్భాగ్యజీవుల్ని చూసి ద్రవించిపోతాడు.

అంతేకాదు. అతనికి ప్రకృతంటే ప్రాణం... సుందర దృశ్యాల్ని చూస్తూ గంటలు నిమిషాల్లా గడిపెయ్యగలడు.

అయితే అతని భార్య జయంతికి ఇవన్నీ ఏం లేవు!... భర్తకి తగ్గ ప్రోత్సాహం కూడా ఇవ్వదు. అతను కథలు చదివి వినిపిస్తుంటే గుర్రుకొట్టి నిద్రపోతుంది. పేదల అగచాట్లు చెప్తుంటే పెదవి విరుస్తుంది.

ఇంక పిల్లలు వాళ్ల చదువులేమిటో వాళ్ల ఆటలేవిటో అంతేగానీ... నాన్న కథల్ని గురించిగానీ, పేరు ప్రఖ్యాతుల్ని గురించిగానీ అసలు పట్టించుకోరు. అంత వయసూ లేదు వాళ్లకి.

అయితే వాళ్లకి పిక్‌నిక్‌లన్నా బోట్‌షైర్లన్నా సినిమాలన్నా చాలా ఇష్టం. అందుకే నర్సాపురం పెళ్లికి అనగానే ఎగిరి గంతేశారు. కారణం పెళ్లంటే వాళ్లకంత ఇష్టమని కాదు. నర్సాపూర్‌లో గోదావరి వుందనీ, ఆ గోదావరిలో చిన్నచిన్న బోట్లుంటాయనీ, ఆ బోట్లలో బోట్‌షికారుకి వెళ్ళచ్చనీ!

అనుకున్నట్టే పెళ్లికాగానే గోదావరి ఒడ్డుకి వెళ్లాలని చూశాడు రావు. అయితే ఎండ తీవ్రంగా వుండడంవల్లా, అభిమానులు చుట్టుముట్టడంవల్లా వెళ్లలేకపోయాడు. అందుకే మధ్యాహ్నం కాసేపు రెస్ట్ తీసుకుని సాయంత్రం కాస్త చల్లబడిందనగానే కారు తీసుకుని బయల్దేరాడు.

దారిలో పిల్లలు చిప్స్, పాప్‌కార్న్‌లాంటి పేకెట్స్ కొని తెచ్చుకున్నారు. దారి ఇరుగ్గానూ, రద్దీగానూ వుండటంవల్ల కారు దిగేసి డ్రైవర్ని కారు ఓ పక్కగా పెట్టమని చెప్పి అంతా కాలినడకనే బయల్దేరారు.

గోదావరి అల్లంతదూరాన ఉండగానే చల్లనిగాలి రివ్వున వీచి, వాళ్ల శరీరాలని తాకి హాయిని కలిగిస్తోంది.

పిల్లలు ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుంటే, జయంతి ముభావంగా నడుస్తోంది.

"ఏవిటోయ్... అలా మౌనంగా ఉండిపోయావ్?... ఇక్కడ కథలేం చదివి వినిపించన్లే!" నవ్వుతూ అన్నాడు రావు భార్యతో.

"ఏం లేదు. కాస్త తలనొప్పి!" అంది జయంతి మెల్లగా.

"అయ్యో... హొటల్‌దగ్గరే చెప్తే... ఏదైనా టేబ్లెట్ తెప్పించుకునేవాళ్ళంగా!... పోనీ.... వెనక్కి వెళ్లిపోదామా?" అన్నాడు రావు ఆదుర్దాగా.

"ఒద్దొద్దు! పదండి!" చేతిలోని బ్యాగ్ సవరించుకుంటూ అంది జయంతి.

అందరూ గోదావరి ఒడ్డుకి చేరుకున్నారు. ఒడ్డున పెద్ద పెద్ద చెట్లు, చెట్లకింద చిన్నచిన్న పాకలువున్నాయి. ఆ పాకలదగ్గరంతా రిక్షాలు, మనుష్యులు!

చెట్లు తమ అందాల్ని నీటిలో చూసుకుంటున్నట్టు గోదావరిలోకే ఒంగి తలలూపుతున్నాయి.

ఒక్క అంగలో చెట్లకిందకి పరిగెత్తారు పిల్లలు. అయితే అంతవరకు వాళ్లమొహాల్లో వున్న ఉత్సాహం, ఆనందం ఎగిరిపోయాయి. మొహాల్ని వికారంగా పెట్టారు.


దూరాన్నించి అది గమనించిన రావు నిండుగోదావర్ని చూసి పిల్లలు భయపడుతున్నారనుకుని సన్నగా నవ్వుకున్నాడు.

అయితే తన ఊహ తప్పని అతను అక్కడికి చేరేసరికి అర్థమైంది.

అక్కడంతా ఘోరమైన వాసన!

నిల్చోవడానికి వీల్లేనంత దుర్గంధం! గాలి పీలుస్తుంటేనే వాంతి వచ్చేలావుంది. రావు మనసంతా అదోలా అయిపోయింది. చక్కని సుందర స్వప్నం చెదిరిపోయినట్టయింది.

"ఇంత మంచి చోటుని, పదిమంది తమని తాము



> చల్లగా చెప్పే మాటలనుబట్టి ఒక వ్యక్తి అంతరంగాన్ని స్వభావాన్ని అంచనావేసి 'మంచి వ్యక్తి' అని అనుకుంటే, చాలా సందర్భాలలో మనం మోసపోవలసి వస్తుంది. కారణం మాటల ముసుగు వెనుక చేతలు మరోలా వుండడమే! అందుకే ఏ వ్యక్తి గురించైనా సరైన అభిప్రాయాన్ని ఏర్పరచుకొనేముందు—మాటలే కాకుండా, చేతల్ని కూడా పరిశీలించాలి.

మర్చిపోయేలా చేసే ఈ గోదావరి తీరాన్ని చల్లని పిల్లగాలి వీచి... రోహిణీకార్తిని సైతం మరపించి చల్లదనాన్ని ఈ చెట్ల నీడని రచయితలకి... అంతులేని భావపరంపరల్ని అందించే... ఈ ప్రదేశాన్ని... పబ్లిక్ లెట్రిన్‌గా వాడే వీళ్లు మనుష్యులేనా?" అనుకుని తిట్టుకున్నాడు. అసహ్యించుకున్నాడు.

అక్కడుండేవాళ్లు ఈ వాసనని ఎలా భరిస్తున్నారా అని ఆశ్చర్యపోయాడు.

"అవతలికి పోదాం డాడీ!" అన్నారు పిల్లలు. ఊఁ ఊఁ రుమంటూ అవతలగా వచ్చారు. అక్కడా వాసనే!... అయితే... అక్కడున్న వాళ్లకేం పట్టనట్టు ఎవరిధోరణిలో వాళ్లున్నారు.

చిన్నచిన్న పడవల్లో జనాన్ని గోదావరి దాటిస్తున్నారు పడవలవాళ్లు.

సామాన్లు, స్కూటర్లు తెలివిగా పడవల్లో చేరుస్తున్నారు కొందరు యువకులు.

"డేడీ! బోట్‌షైరు!" అన్నారు పిల్లలు.

రావు క్షణం మాట్లాడలేదు. మౌనంగా భార్యకేసి చూశాడు.

"పదండి!" అందామె అంగీకారంగా.



– రావినూతల సువర్ణకన్నన్

ఉత్సాహంగా అరిచారు పిల్లలు!

రావు అక్కడే వున్న ఒక అతన్ని అడిగాడు. బోట్‌పైరు వెళ్లాలి. అతను టికెట్స్ ఇచ్చేచోటు చూపించాడు. అక్కడకెళ్లి—

"పడవ మొత్తం కావాలి" అన్నాడు రావు.

"మీరెందరుంటే అన్ని టికెట్స్ తీసుకోండి. అపై డబ్బు పడవవాళ్లతో మాట్లాడుకోండి!" అన్నాడతను.

అలాగే నాలుగు టికెట్స్ తీసుకుని రేవులోకెళ్లారు నలుగురూ.

"ఎక్కండి బాబూ!" ఓ పడవతను మర్యాదగా అన్నాడు.

"మాకు ప్రత్యేకంగా ఓ పడవకావాలి!" అన్నాడు రావు—నిరాశగా చూశాడు పడవతను. అక్కడిక్కాస్త దూరంలో వున్న ఓ మునలాడు ఒక్క అంగలో అక్కడికొచ్చి—

"నా పడవెక్కండి బాబూ!" అన్నాడు. అతని వెనక ఓ పదేళ్ల కుర్రాడు వచ్చాడు. వాళ్లిద్దరి బట్టలూ చిరిగి పేలికలుగా వేళ్లాడుతున్నాయి. తాతకి పైన చొక్కా కూడాలేదు. నీరసంగా వున్నాడు.

బక్కచిక్కిన వాళ్ల నల్లని శరీరాల్ని ఓసారి పరిశీలనగా చూశాడు రావు. అతని హృదయం ద్రవించిపోయింది. అప్రయత్నంగా అతనికళ్లు నీళ్లతో నిండిపోయాయి.

"ఏం ఇమ్మంటావ్?" అంత వరకు నోరు విప్పని జయంతి గంభీరంగా అడిగింది.

"తాతా!..." కుర్రాడు ఏదో అనబోతుంటే—

"ఛస్! నువ్వొల్లకురా! పోలిగా!... పెద్దోల్లని ఇంతియ్యండని అడక్కూడదురా!... అరి దయ. అరిచ్చినంతు చ్చుకోవాలి!" అన్నాడు తాత మనవణ్ణి మందలిస్తున్నట్టు. పోలిగాడనే కుర్రాడు మాట్లాడలేదు.

"అలాకాదు! నువ్వు చెప్పు! ఓసారి ఆ ఒడ్డుకి తీసికెళ్లి మళ్లీ తీసుకురావాలి! దానికి నీకెంతకావాలో చెప్పు!" సీరియస్‌గా అంది జయంతి.

"తవకి తోసిందేదో ఇయ్యండి తల్లీ! తవరు మాకట్టంవుంచుకుంటారా?" అన్నాడు తాత. జయంతి భర్తకేసి చూసింది. అతను—

"నేను చూస్తానుగా! వాళ్ల కష్టం మనం వుంచుకోమని వాళ్లకి బాగా తెలును!" అన్నాడతను. జయంతి మౌనంగా వుండిపోయింది. ఇదేం పట్టనట్టు పిల్లలిద్దరూ కెమెరా సెట్ చెయ్యడంలో మునిగిపోయారు.

వాళ్లంతా ఎక్కగానే పడవ మెల్లగా సాగింది

నిండుగోదావరిలో చల్లని గాలి హాయిగా వీస్తుంటే రావు మనను ఏవో లోకాల్లో విహరిస్తున్నట్టుంది. జయంతి నీళ్లలోకి చూస్తోంది. పిల్లలు కెమేరా క్లిక్ మనిపిస్తున్నారు.

పోలిగాడు ఆ ఫోటోల్లో తాను కూడా పడాలని తెగ తాపత్రయపడిపోతున్నాడు. చొక్కాకి, లాగూకి వున్న చిరుగుల్ని దాచుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

తాత చేతిలోని గెడ అటు ఇటు బలంగా కదుల్తోంది.

అతని నల్లని శరీరంమీద చెమటబిందువులు ముత్యాల్లా రాలుతున్నాయి.

"తాతా!... కాసేపు నడపనా?" అన్నాడు పోలిగాడు తాతకేసిచూస్తూ.

"ఒద్దులేరా!" నవ్వాడు తాత.

"నీక్కూడా బోట్ నడవడం వచ్చా?" కుతూహలంగా అడిగారు పిల్లలు.

"ఓ!... ఎప్పుడన్నా మా తాతకి జొరంవస్తే నేనే నడుపుతాను!" గర్వంగా అన్నాడు పోలిగాడు.

"నేనమ్మను!" అన్నాడు రావు కొడుకు.

"కావాలంటే మా తాతనడగండి. అల్లప్పుడోపాలి మా తాత నెత్తురుకక్కుని పడిపోతే నానుకాదేటి పడవనడిపింది!" అన్నాడు పోలిగాడు.

రావు ముఖం చిట్లించాడు–

"నిజమా?" అన్నట్లు.

"ఒట్టు బాబూ! గోదారమ్మమీదొట్టు! మా తాతకి చయజబ్బొచ్చినాదికదా! అప్పుడోపాలి నెత్తురు కక్కున్నాడు!... మా అయ్య ఈ గోదాట్లోనే పడి ఎటో కొట్టుకెల్లిపోనాడంట! మరి... నానేకదా... వుండాది... అందుకే... నాన్నడిపినాను పడవ!" విపులంగా చెప్పాడు పోలిగాడు.

రావు మనను మరింత భారంగా అయిపోయింది.

"ఇప్పుడు తగ్గిపోయిందా తాతా?" అన్నాడు మెల్లగా.

"ఫరవాలేదు బాబూ!... డాట్రుబాబూ వనిసెయ్యి ద్దంటాడు. మాకెక్కడకుదురుద్ది బాబూ!" జీవంలేని ఓ నవ్వు నవ్వాడు తాత.

పడవ అవతలి ఒడ్డు చేరింది.

"ఓపాలి దిగుతారా బాబూ?" వినయంగా అన్నాడు తాత.

"దిగితే మళ్లీ టిక్కెట్లుకొనాల!" కంగారుగా అన్నాడు పోలిగాడు.

తాత నవ్వాడు.

"అక్కర్లేదు తిప్పెయ్యి!" అంది జయంతి.

"డాడీ! ఇంకాసేపు తిరుగుదాం!" అన్నారు పిల్లలు.

"సరే!... ఇంకాసేపు తిప్పుతాతా!" అన్నాడు రావు నవ్వుతూ.

జయంతి అనహనంగా చూసింది

పిల్లలు పట్టించుకోలేదు.

తాత ఉత్సాహాన్ని బలవంతంగా తెచ్చుకున్నాడు. నాలుగురాళ్లు దొరుకుతాయన్న ఆనందం అతని నీరసాన్ని ఆమడదూరానికి తరిమేసింది.

ఈసారి తాత పడవని పక్కవూరికన్నట్టు తిప్పాడు.

వెన్నుకంటుకున్నట్టున్న అతని కడుపుని చూస్తూ "తాతా! మధ్యాన్నం అన్నం తిన్నావా?" అన్నాడు రావు. తాత మాట్లాడలేదు.

"గెంజితాగాం!" అన్నాడు పోలిగాడు.

"ఏవిటీ ప్రశ్నలు?" అన్నట్టు మొహం చిట్లించింది జయంతి. ఆమెకి ముళ్లమీద కూర్చున్నట్టుంది. అది రావు గమనించలేదు.

తాతని కుశల ప్రశ్నలు వేస్తున్నాడు. అతని కుటుంబాన్ని అతని ఆదాయాన్ని గురించి వివరాలు తెలుసుకున్నాడు.

తాత అతని జాలి గుండెకి... ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు. అందుకే—

తన సంపాదననీ, కష్టాల్నీ చెప్పుకున్నాడు. ఒక గుప్పెడు మెతుకులు లేక తాము ఇంటిల్లపాదీ కడుపులో కాళ్లెట్టుకుని ఎన్నిసార్లు పడుకున్నారో వివరంగా చెప్పుకున్నాడు.

కట్టుకొనడానికి జానెడుగుడ్డా, కప్పుకోనడానికో పాత దుప్పటిముక్కా లేక చలికి వాళ్ల శరీరాలు ఎంత రాటుదేరిపోయాయో దయనీయంగా చెప్పాడు.

పిల్లలు కొన్ని తినుబండారాల్ను పోలిగాడికిచ్చి వాడిని మాటల్లోదించారు.

ఇంత చిన్న వయసులోనే గోదావరి ఈదగలనన్న వాడి మాటలకి నిర్ఘాంతపోయారు. పొద్దుణ్ణించి గంజినీ ళ్లు తప్ప ఏం తినకపోయినా ఆకలంటూ అడగని వాడి ఓర్పుకి తెల్లబోయారు. పెద్ద పండక్కి కూడా పెర్లిన్ బట్టలు కుట్టించుకోలేనందుకు జాలిపడ్డారు.

ఇవన్నీ తనకేం నచ్చనట్టు మొహాన్ని సీరియస్‌గా పెట్టి నిండుగోదావరినీ, నీటిలో అక్కడక్కడ పడుతున్న మబ్బుల నీడల్ని చూస్తూ కూర్చుంది జయంతి.

ఇదంతా గమనిస్తున్న మనవడు తాత చెవిలో గుసగుసగా—

"తాతా!" అన్నాడు.

"ఏటీ?" అన్నట్టు చూశాడతను.

"అమ్మగోరు మామిచ్చుమడిసిలా గుండారు. అయ్య గోరు మనకట్టాల్ని జాలిగా ఇంటంటే... అమ్మగోరు కొరకొరానూస్త న్నారు!" అన్నాడు రహస్యంగా.

తాత కళ్లెర్రచేసి—

"నువ్వు నోరుముయ్యవా!" అంటూ ఒక్క కసురు కసిరాడు. అయినా అతనూ గమనించాడు ఆవిడకి భర్త పిల్లలు తమతో ఆప్యాయంగా మాట్లాడ్డం ఇష్టంలేదని.

అయినా అతను బాధపడలేదు. అతను అలాంటి వాళ్లని చాలామందిని చూశాడు.

సాధారణంగా మగాళ్లకున్న తెగింపు, దానగుణం ఆడవాళ్లకుండదని అతని అభిప్రాయం. అందుకే మొదట్నించీ ఆవిడ ప్రవర్తన గమనించినా అతను పట్టించుకుని బాధపడలేదు.

రావుకి, పిల్లలకి గోదావరిమీద సరదా తీరింది. వెంటనే బోట్ తిప్పించారు.

అప్పటికే నలుమూలల చీకట్లు పరించాయి.

పడవ ఒడ్డుకు చేరింది.

ఛెంగున ఒడ్డుకు దూకారు పిల్లలు. ఆ తరవాత రావు, భార్యకూడా దిగారు.

పడవకట్టేసి తాతా, మనవడు కూడా దిగారు. పీలిక లాంటి గుడ్డతో మొహానికీ పట్టిన చెమట తుడుచుకున్నాడు తాత..

వాళ్లిద్దరి కళ్లలోనూ అంతులేని ఆశ! చేతులు కట్టుకుని రావు ఇవ్వబోయే ప్రతిఫలం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

రావు జేబులోంచి ఓ నోటు తీసి తాతచాచిన చేతుల్లో వుంచాడు.


అది కొత్త అయిదురూపాయలనోటు! తాతామనవళ్ల మొహాలు చిన్నబోయాయి దాన్ని చూడగానే.

"బాబూ !"... దీనంగా అన్నాడు తాత. కనీసం మరో రూపాయైనా అడగాలని అతని ఆశ.

"ఏం తాతా!... ఇంకా వుంటావా? ఇంటికి వెళ్లిపోతావా?" అన్నాడు రావు.

"ఎళ్లిపోతాను బాబూ!... జొరం పేలిపోతాంది!..." నీరసంగా అన్నాడు తాత తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమంతా నీరుగారిపోయి అతని నీరసం రెట్టింపయింది.

"అలాగే చెయ్యి!... మేంవస్తాం! నీ పడవ మూలంగా




మా పిల్లలు బాగా ఎంజాయ్‌చేశారు. మళ్లీ ఈసారి ఎప్పుడైనా ఇక్కడికొస్తే నీ పడవే ఎక్కుతాం" అంటూ అభయంఇచ్చి అతనేదో అనబోయేలోగా వెనుతిరిగాడు రావు.

నోట మాటరానట్టు అలాగే నిలుచుండిపోయారు తాతా, మనవడు.

దగ్గరకొచ్చిన భర్తతో—

"ఎంతిచ్చారేవిటీ?" ముఖం చిట్లించి అంది జయంతి.

"అయిదు రూపాయలు" అన్నాడు తను నడుస్తూనే.

"అయిదు రూపాయలా?"

"అంతకన్నా తక్కువిస్తే ముసలాడు ఏడుస్తాడు!" నవ్వాడు రావు.

"అవును... ఆ మాత్రం ఇవ్వాలి!" తనూ నవ్వింది జయంతి.

హటాత్తుగా ఆమె చేతిలోని పాకెట్ చూసుకుంది. అవి ఇందాక పడవలో పిల్లలు ఆమెకి తినమని పెట్టిన చిప్సు అవి!

"అదేవిటీ... అవి తిన్లేదూ?" అన్నాడు రావు ఆమె చేతిలోని పాకెట్‌చూస్తూ.

"ఊహూ!... ఇందాక గోదావరి చెట్టుకింద వాననతో ఒకటే కడుపులో తిప్పుతోంది. తినాలనిపించలేదు!" అంది జయంతి.

"పారెయ్!"

ఆమెకి ఓ వూహ వచ్చింది.

"పోనీ... ఇవి ఆ కుర్రాళ్ళవకిస్తే?" అంది జయంతి వెనుతిరిగి చూస్తూ.

"పిలవనా?" అన్నాడు రావు.

"ఒద్దు! మీరిక్కడే వుండండి. నేను ఇచ్చేసివస్తా!" అంటూ గబగబా గోదావరికేసి నడిచింది జయంతి.

వాళ్లిద్దరూ ఇంకా అలాగే నిల్చుని నిస్సహాయంగా రావుకేసి చూస్తున్నారు.

జయంతి మళ్లీ రావడం చూసి ఆ తాతామనవళ్ల కళ్లలోకి కొద్దిగా కాంతి వచ్చింది.

"తాతా!... ఇంకోరూపాయి ఇస్తారేమో అయ్యగారు!" అన్నాడు ఆశగా.

తాత మాట్లాడలేదు. వస్తున్న జయంతికేసి చూస్తున్నాడు.

"తాతా! ఇందు! ఇవి తినండి!" పేకెట్ అతని చేతుల్లోపెడుతూ అంది జయంతి.

అది అందుకుని—

"అమ్మా!... ఇంకొక్క రూపాయడబ్బులు..." నసిగాడు తాత.

"ఇంకానా?" కళ్లు చిట్లించింది జయంతి.

"శానాదూరం తీసికెల్లాను తల్లీ!" దీనంగా వుందతని గొంతు.

"నీ కష్టానికి తగ్గ ప్రతిఫలమే నీకు దొరికింది. డబ్బుకేంగానీ ముందు... అవి తినండి!" అందామె.

తాత నిరాశగా పేకెట్ విప్పాడు.

అతని కళ్లు పెద్దవయ్యాయి.

మనవడి కళ్లు తళుక్కుమన్నాయి.

ఆ పొట్లంలో యాభైరూపాయల నోటు!

"అమ్మా!" అన్నాడు తాత మాటరానట్టు.

"ఉంచుకో!" చల్లగా నవ్వింది జయంతి.

"దేవుడు మిమ్మల్ని సల్లగా సూడాలి తల్లీ!" గద్గదస్వరంతో అన్నాడు తాత.

"చూస్తూనేవున్నాడు తాతా!... మిమ్మల్ని కూడా ఆ దేవుడు చల్లగానే చూడాలని నా ఆశ! నా కోరిక!... వెళ్లండి! వెళ్లి మీ పన్లు చూసుకోండి!" అనేసి తిరిగి పెద్ద పెద్ద అంగలతో రావుకేసి నడిచింది జయంతి.

జాలిగా కబుర్లు చెప్పిన అయ్యగారికీ, ముభావంగా వుండి కఠినాత్మురాలిగా తల్చుకున్న అమ్మగారికీ తేడా బేరీజు వేసుకుంటూ మెరుస్తున్న కళ్లతో అలా ఆమెనే చూస్తూండిపోయారు తాతా మనవళ్లు. ❑